## లంచగొండుల వివరాలు ఎసిబికి తెలపండి

ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నట్లు, లంచగొండితనానికి పాల్పడుతున్నట్లు ఎలాంటి సమాచారమున్నా అవినీతి నిరోధక శాఖకు తెలయజేయ వలసిందిగా ఎసిబి డైరెక్టర్ జనరల్ ప్రజలను కోరారు. సమాచారం అలందించిన వారుపేరు, వివరాలను గోప్యంగా ఉంచుతామని ఒక ప్రకటనలో తెలిపారు.

**వివరాలకు:**

**డైరెక్టర్ జనరల్, అవినీతి నిరోధక శాఖ,**
**మొజంజాహి మార్కెట్ రోడ్, హైద్రాబాద్ -500 001**
**ఫోన్: (040) 2475132,**


# దేశ టైమ్స్

DESHA TIMES
TELUGU DAILY

తెలుగు దినపత్రిక


## కాళేశ్వరం ప్రాజెక్ట్ రిపేర్‌పై ప్రభుత్వం కీలక నిర్ణయం

హైదరాబాద్, : కాళేశ్వరం ప్రాజెక్ట్ రిపేర్‌పై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీల పునరుద్ధరణకు కమిటీ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు జశీశ్రీ. పరిచిత్ మెహ్రా ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేసింది. ఇంజినీర్లు, నిపుణులతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసింది. మూడు బ్యారేజీల మరమ్మతులకు సమన్వయ కమిటీ ఏర్పాటు చేసింది. కాళేశ్వరం ప్రాజెక్ట్ రిపేర్ పనులు వేగవంతం చేసేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.మాన్సూన్‌కు ముందే జియో టెక్నికల్ పరిశీలనలు పూర్తి చేయాలని తెలంగాణ సర్కార్ సూచించింది. మే 30వ తేదీలోగా పరిశీలనలు పూర్తిచేయాలని డెడ్‌లైన్ విధించింది. రోజువారీ పురోగతి నివేదికలు సమర్పించాలని ఆదేశాలు జారీ చేసింది. ప్రతిరోజూ సాయంత్రం 5 గంటలకు రిపోర్ట్ ఇవ్వాలని ఆదేశించింది. సీడబ్ల్యూసీ ఎన్డీఎస్ఏ అనుమతులతో పనులు, డిజైనింగ్ పునరుద్ధరణ పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించింది. రోజువారీ యాక్షన్ ప్లాన్‌తో పనులు చేపట్టాలని తెలంగాణ ప్రభుత్వం సంబంధిత అధికారులను ఆదేశించింది.


నల్లగొండ సంపుటి:16 సంచిక:91 ఎడిటర్: సయ్యద్ పాష 18-04-2026 శనివారము పేజీలు :8 వెల:1/-


## సమ్మె విరమిస్తున్నాం..



హైద్రాబాద్: ట్రాన్స్‌కో సీఎండీతో మా సమస్యల పై చర్చించేందుకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశించిన నేపథ్యంలో వెంటనే సమ్మె విరమించాలని నిర్ణయించినట్టు ఆర్టిజన్ల జేఏసీ చైర్మన్ సతీష్ రెడ్డి ప్రకటించారు. శుక్రవారం ఉదయం హైదరాబాదులోని ప్రజా భవన్‌లో ఆర్టిజన్ల జేఏసీ నాయకులు డిప్యూటీ సీఎంతో సమావేశమయ్యారు. తమ సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి ఉన్నతాధికారులతో చర్చలకు అనుమతించిన డిప్యూటీ సీఎంకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్టు ఆర్టిజన్ల జేఏసీ కన్వీనర్ సాయిలు ప్రకటించారు.సమ్మెపై బ్యాన్ ఉన్నదని తెలిసి, వేసవిలో విద్యుత్తు డిమాండ్ పీక్ స్థాయిలో ఉంటుంది ఈ సమయంలో అకస్మాత్తుగా సమ్మెకు వెళ్లడం సరైనది కాదని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. చర్చల ద్వారానే సమస్యల పరిష్కారం జరుగుతుందని డిప్యూటీ సీఎం ఈ సందర్భంగా తెలిపారు. ఆర్టిజన్ల సమస్యలపై మానవీయ కోణంలో ప్రజా ప్రభుత్వం ఆలోచన చేస్తుందని తెలిపారు. విద్యుత్ సంఘాల నేతలు ఎప్పుడు వచ్చినా ప్రభుత్వం చర్చలు చేస్తుంది...వారి సమస్యలను పరిష్కరిస్తూ ముందుకు పోతుందని జేఏసీ నాయకులకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క గుర్తు చేశారు. ఆర్థిక భారం లేకుండా మానవీయ కోణంలో పరిష్కరించగలిగే సమస్యలపై ఆర్టిజన్ల జేఏసీతో ట్రాన్స్‌కో సీఎండీ చర్చలు జరుపుతారు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని డిప్యూటీ సీఎం ఈ సందర్భంగా తెలిపారు. చర్చల్లో ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణ భాస్కర్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఆర్టిజన్ల కో చైర్మన్లు చంద్రారెడ్డి, శ్రీధర్ గౌడ్, చందర్ సింగ్ ఠాకూర్, వైస్ చైర్మన్ సంతోష్, కోశాధికారి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## కాళేశ్వరం ప్రాజెక్టుపై మా ప్రభుత్వానికి ఎలాంటి దురుద్దేశం లేదు



ఢిల్లీ, : కాళేశ్వరం ప్రాజెక్టుపై సీఎం రేవంత్‌రెడ్డికి, తమ ప్రభుత్వానికి ఎలాంటి దురుద్దేశం లేదని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈనెల 20వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి మేడిగడ్డ బ్యారేజ్‌ను పరిశీలిస్తామని పేర్కొన్నారు. ఈరోజు (శుక్రవారం) ఢిల్లీ వేదికగా మీడియాతో మంత్రి ఉత్తమ్ మాట్లాడారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ చైర్మన్ అనిల్ జైన్‌తో కాళేశ్వరం ప్రాజెక్టు, మేడిగడ్డ బ్యారేజ్ మరమ్మతులు, పునరుద్ధరణపై చర్చించామని తెలిపారు.గోదావరి వరదలు వచ్చేలోగా సాయిల్ టెస్టింగ్, డిజైన్లు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంపై కేసీఆర్ హయాంలో చేసిన పొరపాటు తెలంగాణ ప్రజలకు తెలుసునని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ హయాంలో కాళేశ్వరాన్ని నిర్మించారని, అది కూలిపోయిందని అన్నారు. కాళేశ్వరంపై దాదాపు రూ.97 వేల కోట్ల ప్రజాధనాన్ని ఖర్చు చేసి ఆ ప్రాజెక్టు నిర్మించారని తెలిపారు.కాళేశ్వరంపై ప్రతి ఏడాది రూ.10వేల కోట్ల వడ్డీ కడుతున్నామని తెలిపారు. ప్రజాధనం ఉపయోగించడంతోనే దాన్ని ఎలా రిపేర్ చేయాలో ఆలోచించి ముందుకు వెళ్తున్నామని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజలు అన్నీ విషయాలు గమనిస్తున్నారని అన్నారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ మార్గదర్శకాలకు అనుగుణంగా ముందుకు వెళు‌తున్నామని చెప్పుకొచ్చారు. మేడిగడ్డ డ్యామేజ్ సాయిల్ టెస్ట్, డిజైన్ల ఖర్చులను కాంట్రాక్ట్ సంస్థలే భరిస్తాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

## ఏసీబీ వలలో బిచ్కుంద ఎక్సైజ్ సీఐ..

నిజామాబాద్ : కామారెడ్డి జిల్లా బిచ్కుంద ఎక్సైజ్ సీఐ సత్యనారాయణఇంటిపై ఏసీబీ అధికారులు దాడులు చేశారు. బిచ్కుందలోని అద్దె ఇంట్లో ఉంటున్న సీఐ బాధితుడి నుంచి రూ.2 లక్షలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.కల్లు దుకాణం మరో గ్రామానికి తరలింపునకు అనుమతులు, కేసులు నమోదు చేయవద్దని కోరగా ప్రతిఫలంగా ఎక్సైజ్ సీఐ దీను సత్యనారాయణ లంచం డిమాండ్ చేశాడు. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేయడంతో సీఐ ఇంటిపై దాడి చేసి పట్టుకు న్నారు. అదేవిధంగా అతని వద్ద అదనంగా లభించిన రూ.45,670లను స్వాధీనం చేసుకున్నట్లు ఏసీబీ అధికారులు వివరించారు. సీఐపై కేసు నమోదు చేసి నాంపల్లి కోర్టులో హాజరుపరిచినట్లు వెల్లడించారు.

## మహిళాబిల్లు ముసుగులో దేశ రాజకీయ చిత్రపటాన్ని మార్చే కుట్ర



న్యూఢిల్లీ:ప్రభుత్వం ఇప్పుడు పెట్టేది అసలు మహిళా బిల్లే కాదని, 2023లోనే అది ఆమోదం పొందిందని ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ అన్నారు. ఇప్పుడు కొత్తగా మహిళా బిల్లు పెట్టాల్సిన అవసరమే లేదని చెప్పారు. మహిళాబిల్లు ముసుగులో దేశ రాజకీయ చిత్రపటాన్ని మార్చే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. పాత మహిళా బిల్లును రద్దుచేసి కొత్త బిల్లు తీసుకురావాలని కేంద్రానికి సవాల్ విసిరారు. అప్పుడు కాంగ్రెస్ పార్టీ ఎలాంటి అభ్యంతరం చెప్పకుండా మద్దతు ఇస్తుందని రాహుల్‌గాంధీ స్పష్టం చేశారు. పార్లమెంటు ప్రత్యేక సమావేశాల చర్చలో మహిళా బిల్లుపై శుక్రవారం మధ్యాహ్నం లోక్‌సభలో రాహుల్ గాంధీ ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన కీలక కామెంట్స్ చేశారు. ఆ వ్యాఖ్యలు సభలో గందరగోళం సృష్టించాయి.కేవలం అధికారాన్ని శాశ్వతం చేసుకునేందుకే ప్రధాని మోదీ ఈ రాజకీయ వ్యూహాన్ని పన్నారని ఆయన విమర్శించారు. బీజేపీ తమకు లాభం చేకూర్చేలా లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల సరిహద్దులను మార్చుకోవడానికి ప్రయత్నిస్తోందన్నారు. ఈ ప్రయత్నాన్ని 'గెర్రీమాండరింగ్'గా రాహుల్ అభివర్ణించారు. 2029 ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు బీజేపీ ఈ కుట్రకు తెర తీసిందని, నియోజకవర్గాల పటాలను మార్చడం ద్వారా ప్రతిపక్షాల బలాన్ని తగ్గించాలని మోదీ చూస్తున్నారని రాహుల్ ఆరోపించారు.కేవలం మహిళా రిజర్వేషన్లే ఈ పార్లమెంటు సెషన్ అజెండా అయితే, తాము ఏమాత్రం సంకోచించకుండా ఈ క్షణంలోనే ఆ బిల్లుకు సంపూర్ణ మద్దతు ఇస్తామని ఆయన స్పష్టం చేశారు. మహిళా రిజర్వేషన్లకు పార్లమెంటు ఉభయ సభల్లోని ప్రతీ ఎంపీ మద్దతు ఇస్తారని తేల్చి చెప్పారు. భారతదేశ జాతీయ ఆలోచనా విధానంలో మహిళలు ఒక చోదక శక్తి అని రాహుల్ గాంధీ అన్నారు. మనమంతా మహిళల జీవితాల ద్వారా ఎంతో ప్రభావితులం అయ్యామని, ఎన్నో విషయాలను నేర్చుకున్నామని ఆయన చెప్పారు.కానీ కేంద్ర ప్రభుత్వం డీలిమిటేషన్, జనాభా గణనలతో మహిళా కోటాకు ముడిపెట్టడం సరికాదన్నారు. మహిళా కోటా అమలుకు డీలిమిటేషన్‌తో అసలు సంబంధమే లేదని, దీన్ని వెంటనే అమల్లోకి తేవచ్చని రాహుల్ తెలిపారు. దక్షిణాది, ఈశాన్య రాష్ట్రాలకు అన్యాయం చేసేలా నియోజకవర్గాల పునర్విభజన జరిగితే దేశ ప్రయోజనాలకు విఘాతం కలుగుతుందన్నారు. కులగణన డేటాను విస్మరించడం ద్వారా ఓబీసీ, దళిత, ఆదివాసీ వర్గాల హక్కులను కేంద్రం దోచుకుంటోందని ('హిస్సా చోరీ') ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

## తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పాలి




ఖమ్మం,: పార్లమెంట్ ఆవరణలో తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు నిరసన చేపట్టారు. తెలంగాణ ఏర్పాటును భారత్- పాకిస్థాన్ విభజనతో పోల్చుతూ బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య లోక్‌సభలో చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై ఆందోళనకు దిగారు. ఆయనకు వ్యతిరేకంగా ఎంపీలంతా కలిసికట్టుగా నినాదాలు చేశారు. ఆయన కచ్చితంగా తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. చరిత్రలో గొప్ప తెలంగాణ ఉద్యమాన్ని అవమానించవద్దని ప్లకార్డులు ప్రదర్శించారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వ్యతిరేకంగా కూడా ఎంపీలు గట్టిగా నినాదాలు చేశారు.తొలగిస్తామని స్పీకర్ హామీ : అనంతరం లోక్‌సభలో తేజస్వీ సూర్య వ్యాఖ్యలపై తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు స్పీకర్‌ను కలిశారు. ఆయన గురువారం లోక్?సభలో చేసి వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని విజ్ఞప్తి చేశారు. రికార్డులు పరిశీలించి తొలగిస్తామని తమకు హామీ ఇచ్చినట్లు కాంగ్రెస్ ఎంపీలు తెలిపారు. మరోవైపు తేజస్వీ సూర్య వ్యాఖ్యలను బీజేపీ ఖండించకపోవడాన్ని బీఆర్?ఎస్ నేతలు తప్పుపట్టారు. ఇవాళ నాంపల్లిలోని బీజేపీ కార్యాలయాన్ని బీఆర్ఎస్వీ నేతలు ముట్టడించారు. తేజస్వి వ్యాఖ్యలకు నిరసనగా ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టినట్లు చెప్పారు. తేజస్వి వెంటనే తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇదే సమయంలో బీజేవైఎం కార్యకర్తలు రావడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో బీఆర్ఎస్వీ నేతలను పోలీసులు అరెస్టు చేశారు.కిషన్? రెడ్డి స్పీకర్?ను ఒప్పించాలి : తెలంగాణను అవమాన పరిచేటట్లు నిన్న తేజస్వీ సూర్య పార్లమెంటులో చేసిన వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలిగించేందుకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చొరవ తీసుకుని స్పీకర్‌ను ఒప్పించాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. తాను ఇప్పటికే స్పీకర్‌కు లేఖ కూడా రాశానని పేర్కొన్న ఆయన తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు భారత్-పాకిస్థాన్ విభజనతో పోల్చడం సరికాదన్నారు. తేజస్వీ సూర్య చేసిన వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలిగించాలని స్పీకర్‌కు విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి వ్యాఖ్యలు చేయకుండా తేజస్వీ సూర్యకు సూచించాలని కోరారు.తేజస్వీపై చర్యలు తీసుకోవాలి : పదే పదే బీజేపీ అధిష్ఠానం తెలంగాణపై వ్యతిరేక వ్యాఖ్యలు చేస్తోందని ఆచార్య కోదండరామ్ అన్నారు. తేజస్వీ సూర్యపై చర్యలు తీసుకోవాలని స్పీకర్‌కు విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిపారు. నిన్న లోక్‌సభలో తేజస్వీ సూర్య చేసిన వ్యాఖ్యలను రికార్డు నుంచి తొలగించాలని అన్నారు. జనాభా లెక్కల ప్రకారం డీలిమిటేషన్ చేస్తామంటున్నారని 2011 జనాభా లెక్కల ప్రకారం చేస్తారో లేదా ప్రస్తుత జనాభా లెక్కల ప్రకారం చేస్తారో చెప్పాలని ప్రశ్నించారు.

## 30 లక్షల మెట్రిక్ టన్నుల బాయిల్డ్ రైస్ సేకరించాలి



న్యూఢిల్లీ:యాసంగి పంటకు సంబంధించి తెలంగాణ నుంచి 30 లక్షల మెట్రిక్ టన్నుల (ఎల్ఎంటీ) బాయిల్డ్ రైస్ సేకరించాలని కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కోరారు. ధాన్యం యాసంగి పంట బాయిల్డ్ రైస్ మిల్లింగ్‌కు తెలంగాణ అనుకూలమని వారు కేంద్ర మంత్రికి తెలియజేశారు. గత ఆరు యాసంగి సీజన్లలో కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) సరఫరా గణాంకాలను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతుందని చెప్పారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో కేంద్ర మంత్రి జోషిని ఆయన నివాసంలో కలిశారు. దేశవ్యాప్తంగా బాయిల్డ్ రైస్‌కు భారీ డిమాండ్ ఉన్నందున సరఫరా పెంచాలని ఇటీవల కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ విభాగం అధికారులు సూచించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు.తెలంగాణలో ఈ యాసంగి సీజన్‌లో 90 ఎల్ఎంటీ ధాన్యం ఉత్పత్తి అవుతుందని కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషికి వివరించారు. యాసంగి ధాన్యం బాయిల్డ్ రైస్ మిల్లింగ్‌కు అనుకూలంగా ఉంటుందని, అందువల్ల యాసంగి పంటకు సంబంధించి మొత్తం 30 ఎల్ఎంటీ బాయిల్డ్ రైస్ (5 శాతం నూకతో), 5 ఎల్ఎంటీ రా రైస్ (10 శాతం నూకతో) సరఫరా చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని కేంద్ర మంత్రికి చెప్పారు. బాయిల్డ్ రైస్ సరఫరాకు సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపాదనకు కేంద్ర మంత్రి సూత్రప్రాయంగా ఆమోదం తెలిపారు.2014--15 వర్షాకాలం పంట అదనపు లెవీ సేకరణకు సంబంధించిన రూ. 1,468.94 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషికి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. దేశంలోనే వరి ధాన్యం ఉత్పత్తి, సేకరణలో తెలంగాణ అగ్రగామిగా ఉందని, ధాన్యం సేకరించిన 48 గంటల్లోనే రైతులకు తాము చెల్లింపులు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మీద ఉన్న ఒత్తిడిని గుర్తించి వెంటనే పాత బకాయిలు విడుదల చేయాలని కోరారు. పిల్లల్లో రక్తహీనత, పోషకాల లోపాల నివారణకు గాను పోషకాహార బియ్యాన్ని పాఠశాలలు, వసతిగృహాలు, ఐసీడీఎస్ పరిధిలో పంపిణీ చేసేవారని, ఇటీవల దానిని నిలిపివేశారని పేర్కొంటూ వెంటనే పునఃప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషితో జరిగిన సమావేశంలో ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి జితేందర్, సెక్రెటరీ కో-ఆర్డినేషన్ అద్వైత్ సింగ్‌తోపాటు కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## శాశ్వతంగా అధికారంలో ఉండాలని బీజేపీ కుట్ర



హైదరాబాద్, : తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుపై బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణ జన సమితి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ.కోదండ రాం తెలిపారు. ఎంతో మంది ప్రాణ త్యాగం చేస్తే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైందని గుర్తు చేశారు. తెలంగాణ ఆకాంక్షలను బీజేపీ సీనియర్ నేతలు సుష్మా స్వరాజ్, అరుణ్ జైట్లీ అర్థం చేసుకున్నారని చెప్పారు. తేజస్వీ సూర్యని బీజేపీ నేతలు వెనకేసుకు రావడం బాధాకరమని పేర్కొన్నారు. రాజ్యాంగ బద్ధంగానే తెలంగాణ ఏర్పాటైందని చెప్పారు. పదే పదే తెలంగాణను కించ పరచడం పద్ధతి కాదంటూ బీజేపీ నేతలకు ఈ సందర్భంగా ఆయన హితవు పలికారు.శుక్రవారం హైదరాబాద్‌లో తెలంగాణ జన సమితి పార్టీ కార్యాలయంలో ప్రొ. కోదండ రాం విలేకర్లతో మాట్లాడుతూ.. ఏ మాత్రం సందర్భం లేకుండా తెలంగాణ ఏర్పాటుపై తప్పుడు ఆరోపణలు చేశారంటూ తేజస్వీ సూర్యపై మండిపడ్డారు. రాజ్యాంగంలోని ఆర్టికల్-3 ప్రకారం రాష్ట్రాల కూర్పు జరుగుతుందని వివరించారు. ఏ మాత్రం అవగాహన లేకుండా బ్రిటీష్ కాలం నాటి పరిస్థితులకు తెలంగాణ ఏర్పాటుకు ముడి పెడుతూ తేజస్వీ సూర్య విమర్శలు చేశారని విమర్శించారు. బీజేపీ ఎంపీ మాట్లాడుతుంటే.. కేంద్ర మంత్రులు కూడా ఆయన్ని నిలువరించక పోవడం బాధాకరమన్నారు.తెలంగాణ ప్రత్యేక రాష్ట్రానికి సంబంధించిన బిల్లుకు బీజేపీ నేతలు సుష్మా స్వరాజ్, వెంకయ్య నాయుడు మద్దతు ఇచ్చారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఆ విషయం అర్థం చేసుకోకుండా.. తేజస్వీ సూర్య మాట్లాడటం బాధాకరమన్నారు. తెలంగాణను విమర్శించే విధంగా తేజస్వీ సూర్య చేసిన వ్యాఖ్యలను రాష్ట్ర బీజేపీ ఎంపీలు ఖండించక పోవడం శోచనీయమని పేర్కొన్నారు. తేజస్వీ సూర్య వ్యాఖ్యలు పార్లమెంట్ రికార్డుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. అతడిపై చర్యలు తీసుకోవాలని బీజేపీలోని సీనియర్లకు స్పష్టం చేశారు.డీలిమిటేషన్ బిల్లు ఆమోదం పొందితే.. రాష్ట్రాలకు సంబంధించిన సీట్లను జనాభా ప్రాతిపదికన కేటాయిస్తారని ప్రొ. కోదండ రాం తెలిపారు. 2011 జనాభా లెక్కల ప్రకారమా?.. 2026 జనాభా లెక్కల ప్రకారమా? ఈ డీలిమిటేషన్ చేస్తుంది అనేది ప్రశ్నార్థకంగా మారిందన్నారు. 2026 జనాభా లెక్కల ప్రకారం డీలిమిటేషన్ చేయాలని కేంద్రాన్ని ఆయన డిమాండ్ చేశారు. ఉత్తరాది, దక్షిణాది మధ్య అసమతుల్యత, తారతమ్యాలు ఈ డీలిమిటేషన్ చూపిస్తుందన్నారు. అన్ని రాష్ట్రాలకు అర్థవంతమైన భాగస్వామ్యం ఉండాలని.. లేకంటే గొడ్డలి పోట్టు లాంటిదని ఆయన అభిప్రాయపడ్డారు.దేశ ప్రయోజనాలను మర్చిపోయి డీలిమిటేషన్ బిల్లు తీసుకురావడం బాధాకరమన్నారు. డీలిమిటేషన్, సీట్ల ప్రక్రియను తక్షణమే నిలిపి వేయాలంటూ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీట్ల పెంచుకుని శాశ్వతంగా అధికారంలో ఉండాలని బీజేపీ కుట్ర చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ బలంగా ఉన్న రాష్ట్రాల్లో సీట్లు పెంచుకుని.. ఆధిపత్యాన్ని పెంచుకోవాలని చూస్తోందని ఆ పార్టీ నేతల తీరును ఎండగట్టారు. రాష్ట్ర ప్రభుత్వం పంపిన బీసీ రిజర్వేషన్స్ బిల్లును కేంద్రం తొక్కి పెట్టిందని గుర్తు చేశారు.మే12వ తేదీన తెలంగాణ జన సమితి ప్లీనరీ నిర్వహిస్తున్నామన్నారు. ఈ ప్లీనరీ వేదికగా తమ భవిష్యత్తు కార్యాచరణను రూపొందిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా తెలంగాణ జన సమితి 4వ ప్లీనరీ పోస్టర్స్‌ను ప్రొ. కోదండ రాం ఆవిష్కరించారు.

## పెట్టుబడుల పేరిట భారీ స్కామ్..

హైదరాబాద్: పెట్టుబడుల పేరుతో కోట్లు వసూలు చేసిన కేటుగాడిని ఆర్థిక నేరాల విభాగం పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడు రమావత్ మధుని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. రమావత్ మధు, రమావత్ సక్రూ, బండి శివకుమార్ కలిసి శుభ క్షేత్ర వెంచర్ ప్రారంభించారు. సంగారెడ్డి జిల్లా న్యాల్కల్ మండలం దామరగిద్దలో 16 ఎకరాల్లో వెంచర్ అంటూ భారీ ప్రచారం చేశారు. హైదరాబాద్ మియాపూర్‌లో కార్యాలయం ఏర్పాటు చేసి పలువురిని నమ్మించారు. అనంతరం పెట్టుబడుల పేరిట మోసాలకు దిగారు. డిపాజిట్ స్కీమ్‌తో భారీగా నగదు వసూళ్లకు పాల్పడ్డారు. తమ వెంచర్‌లో రూ.5 లక్షలు పెట్టుబడి పెడితే 102 గజాల ప్లాట్ రిజిస్ట్రేషన్ చేసి ఇస్తామని.. నెలకు రూ.25 వేలు చొప్పున 42 నెలలపాటు చెల్లిస్తామంటూ మాయమాటలు చెప్పారు. వారిని నమ్మిన 33 మంది నుంచి ఏకంగా రూ.6.58 కోట్లు వసూలు చేశారు. రోజులు, నెలలు గడుస్తున్నా ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయకపోగా.. ప్రతి నెలా ఇస్తామన్న నగదూ చెల్లించలేదు.ఇదేంటని ప్రశ్నించిన బాధితులపై బెదిరింపులకు దిగారు మధు అండ్ గ్యాంగ్. దీంతో ఈఓడబ్ల్యూ పోలీసులను బాధితుడు సంతోశ్ ఆశ్రయించాడు. సెప్టెంబర్ 2025లో మధు అండ్ గ్యాంగ్ మాటలను నమ్మి రూ.5 లక్షలు పెట్టుబడిగా పెట్టి మోసపోయినట్లు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు తాజాగా ప్రధాన నిందితుడు మధుని అరెస్టు చేశారు. అయితే, శుభ క్షేత్రతోపాటు గోకుల్ నందన ఇన్ఫ్రా సంస్థలకూ మధు డైరెక్టర్‌గా ఉన్నారని విచారణలో తేలింది. శుభ క్షేత్ర వెంచర్ కోసం తీసుకున్న నగదును గోకుల్ నందనలోకి మళ్లించినట్లు గుర్తించారు.

# భానుప్రియ మతిస్థిమితం కోల్పోయిందా?




ఒకప్పుడు తెలుగు సినిమాల్లో ఒక వెలుగు వెలిగిన కథానాయికల్లో భానుప్రియ ఒకరు. 80వ దశకంలో తెలుగులో ఉన్న అందరు అగ్రకథానాయికులతోనూ ఆమె సినిమాలు చేశారు. 'స్వర్ణకమలం' సహా ఎన్నో చిత్రాల్లో తన అందం, అభినయంతో ఆమె కట్టిపడేశారు. ఐతే తర్వాత ఆమెకు అవకాశాలు తగ్గిపోయాయి. కొన్నేళ్లు క్యారెక్టర్ రోల్స్‌లో కనిపించిన భానుప్రియ.. క్రమంగా సినీ రంగానికి దూరం అయిపోయారు. కొన్నేళ్లుగా భానుప్రియ ఆరోగ్యం బాగా లేదని వార్తలు వస్తున్నాయి. ఇటీవల ఆమె పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారిందని.. డిమెన్షియా కారణంగా మతిస్థిమితం కూడా కోల్పోయిందని.. ఎవరినీ గుర్తించే పరిస్థితిలో కూడా లేదని ప్రచారం జరుగుతోంది. ఈ ప్రచారంపై భానుప్రియ చెల్లెలు, 'మహర్షి' సహా పలు చిత్రాల్లో నటించిన శాంతి ప్రియ స్పందించారు. భానుప్రియ ఆరోగ్యం బాగా లేని మాట వాస్తవమే అని.. కానీ ఆమె జ్ఞాపక శక్తి కోల్పోయి ఎవరినీ గుర్తించలేని స్థితిలో ఉందంటూ జరుగుతున్న ప్రచారం అవాస్తవమని ఆమె స్పష్టం చేసింది. ఇండస్ట్రీ నుంచి ఎవ్వరూ భానుప్రియను పట్టించుకోవడం లేదని.. 80వ దశకం రీ యూనియన్‌కు కూడా తన సోదరిని పిలవట్లేదని శాంతి ప్రియ ఆవేదన వ్యక్తం చేసింది. భానుప్రియ ఫోన్ నంబర్ లేకపోతే తనకు లేదా తమ అన్నయ్యకు ఫోన్ చేసి మాట్లాడొచ్చని.. ఇండస్ట్రీలో అందరికీ ఆయన తెలుసని.. అయినా ఎవ్వరూ భానుప్రియ కోసం సంప్రదించలేదని శాంతి ప్రియ పేర్కొంది. భర్త మరణం తర్వాత భానుప్రియ డిప్రెషన్‌కు గురైందని.. ఆమె కొన్నేళ్లుగా మనోవేదన అనుభవిస్తోందని శాంతిప్రియ చెప్పింది. ఆమెకు కొన్ని సినిమాల్లో అవకాశాలు వచ్చాయని.. కానీ తన పాత్ర గురించి ముందు ఒకటి చెప్పి, తీరా షూట్‌కు వెళ్లాక ఆ పాత్రలను మార్చేయడం వల్ల భానుప్రియ ఎంతో బాధ పడ్డారని.. అందుకే ఆమె సినిమాలకు దూరం అయ్యారని ఆమె చెప్పింది. భానుప్రియ ఇకపై సినిమాల్లో నటించరని.. తాను మాత్రం నటిగా కొనసాగుతానని శాంతి ప్రియ స్పష్టం చేసింది. 'బ్యాడ్ గర్ల్' సినిమాలో తన పాత్రకు భానుప్రియనే డబ్బింగ్ చెప్పిందని.. ఆమె మానసిక స్థితి ఏమీ దెబ్బ తినలేదని.. ఆమె గురించి అసత్యాలు ప్రచారం చేయొద్దని శాంతి ప్రియ కోరింది.

# ఓటు ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమాలు


హైద్రాబాద్: భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఈ కేసును విచారించింది. పిటిషనర్ తరపు న్యాయవాది తన వాదనలు వినిపిస్తూ.. ఓటు వేయని వారిపై ఆంక్షలు విధిస్తేనే పోలింగ్ శాతం పెరుగుతుందని పేర్కొన్నారు. దీనిపై సీజేఐ ఘాటుగా స్పందించారు. "ఒకవేళ పౌరుడు ఓటు వేయడానికి వెళ్లకపోతే మనం ఏం చేయగలం? అతన్ని అరెస్టు చేయాలని మేం పోలీసులను ఆదేశించాలా?" అని ప్రశ్నించారు. చట్టబద్ధమైన పాలన ఉన్న దేశంలో బాధ్యతాయుతమైన ఓటరుగా ఉండాలని ఆశించడం వేరని, కానీ శిక్షాత్మక చర్యలతో వారిని లొంగదీసుకోవడం వేరని కోర్టు అభిప్రాయపడింది. ఓటు హక్కు వినియోగం అనేది ప్రజల్లో ఉండాల్సిన అవగాహన మీద ఆధారపడి ఉంటుందే తప్ప, చట్టబద్ధమైన నిర్బంధం కాదని కోర్టు పేర్కొంది. ఓటు ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమాలను బలోపేతం చేయాలని, శిక్షలు విధిస్తామంటే అది రాజ్యాంగ స్ఫూర్తికే విరుద్ధమని ధర్మాసనం వ్యాఖ్యానించింది. గతంలో పట్టణ ప్రాంతాల్లో తక్కువ పోలింగ్ శాతంపై సీజేఐ ఆందోళన వ్యక్తం చేసినప్పటికీ, అది వ్యవస్థాపక మార్పుల ద్వారా జరగాలే తప్ప కోర్టు ఆదేశాల ద్వారా కాదని స్పష్టం చేశారు. ఈ పిటిషన్ పూర్తిగా 'విధానపరమైన నిర్ణయం' కిందకు వస్తుందని, దీనిపై ఏదైనా మార్పులు చేయాలంటే అది కేంద్ర ప్రభుత్వం లేదా పార్లమెంటు మాత్రమే చేయగలవని న్యాయమూర్తులు పేర్కొన్నారు. న్యాయస్థానం ఈ విషయంలో జోక్యం చేసుకోలేదని స్పష్టం చేస్తూ, పిటిషనర్ తన సూచనలను సంబంధిత అధికారులకు లేదా శాసన వ్యవస్థకు పంపుకోవచ్చని సూచిస్తూ అజయ్ గోయెల్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసును కొట్టివేసింది.

# తెలంగాణలో కొత్తగా 79 డయాలసిస్ కేంద్రాలు



హైద్రాబాద్: తెలంగాణలో కిడ్నీ వ్యాధిగ్రస్తుల కోసం ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మెరుగైన చికిత్స అందించేందుకు రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 79 డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. అలాగే ప్రస్తుతం ఉన్న డయాలసిస్ కేంద్రాల్లో పడకల సంఖ్యను పెంచనుంది. మారుమూల గ్రామాలు, గిరిజన ప్రాంతాల నుంచి కిడ్నీ రోగులు డయాలసిస్ కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితులు ఉన్నాయి. అందుకే తెలంగాణ ప్రభుత్వం ప్రతి 25 కిలోమీటర్ల దూరానికి ఒక కేంద్రం ఉండేలా ప్లాన్ చేస్తోంది. కొత్త డయాలసిస్ కేంద్రాలకు సంబంధించి వైద్య ఆరోగ్య శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కొత్త డయాలసిస్ సెంటర్లను పీపీపీ (ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంలో) పద్ధతిలో 'హబ్ అండ్ స్పోక్' మోడల్‌లో నిర్వహించనున్నారు. ఈ డయాలసిస్ కేంద్రాలకు హైదరాబాద్‌లోని నిమ్స్, ఉస్మానియా, గాంధీ ఆస్పత్రులు మెయిన్ హబ్‌లుగా ఉంటాయి. క్లినికల్ రివ్యూ, టెక్నికల్ గైడెన్స్ అందిస్తాయి. కొత్త డయాలసిస్ కేంద్రాలు ములుగు, జయశంకర్ భూపాలపల్లి, ఆసిఫాబాద్ వంటి మారుమూల ప్రాంతాలలో ఏర్పాటు చేయనున్నారు. మొత్తం 416 బెడ్‌లు అందుబాటులోకి వస్తాయని చెబుతున్నారు. ఇలా ఒక్కో కేంద్రంలో 5 నుంచి 10 వరకు డయాలసిస్ యంత్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ 79 డయాలసిస్ సెంటర్లను బోధనాసుపత్రులు, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో ఏర్పాటు చేయనున్నారు. అలాగే ఇప్పటికే ఉన్న 67 డయాలసిస్ సెంటర్లలో అదనంగా మరో 155 మెషిన్లు ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. కొత్తగా ఏర్పాటు చేయనున్న డయాలసిస్ సెంటర్లతో పాటుగా, బెడ్లు అదనంగా ఏర్పాటు చేస్తే రోగులు నిరీక్షణ సమయం తగ్గుతుందని, ఎమర్జెన్సీ కేసుల్లో త్వరగా వైద్యం అందించే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. కొత్త డయాలసిస్ సెంటర్ల ఏర్పాటుకు టీజీఎంఎస్ఐడీసీ ద్వారా టెండర్ల ప్రక్రియను వెంటనే చేపట్టాలని అధికారుల్ని ఆదేశించారు. తెలంగాణలో డయాలసిస్ సెంటర్లు హబ్, స్పోక్ విధానంలో కొనసాగుతున్నాయి. మొత్తం మీద కొత్త డయాలసిస్ కేంద్రాల ఏర్పాటుతో కిడ్నీ రోగులకు ఊరట దక్కనుంది. అలాగే సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పనిలేకుండా దగ్గరలోనే డయాలసిస్ చేయించుకోవచ్చు.

# రాజమౌళి తీరిగ్గా బ్రేక్ తీసుకున్నారంటే..?



దర్శకధీరుడు రాజమౌళి వర్కింగ్ స్టైల్ గురించి ఇండస్ట్రీలో అందరికి తెలిసిందే. సినిమా మొదలుపెడితే అది పూర్తయ్యే వరకు ఆయన వేరే లోకాన్ని చూడరు. హీరోలకు చిన్న గ్యాప్ కూడా ఇవ్వకుండా సెట్ లోనే బంధించేస్తుంటారు. 'మర్యాదరామన్న' లాంటి చిన్న సినిమాకే ఏడాదికి పైగా సమయం తీసుకున్న జక్కన్న, ఇప్పుడు ఏకంగా 1000 కోట్ల భారీ బడ్జెట్ సినిమా విషయంలో తన పాత పద్ధతులను పూర్తిగా పక్కన పెట్టేసినట్లు కనిపిస్తోంది. షూటింగ్ మధ్యలో ఫ్యామిలీతో కలిసి హాలిడే ట్రిప్ ప్లాన్ చేస్తున్నట్లు ఒక లీక్ రాగానే అందరూ షాక్ అవుతున్నారు. సాధారణంగా రాజమౌళి ఏదైనా సినిమా రిలీజ్ అయిన తర్వాతే రిలాక్స్ అవుతారు. కానీ మహేష్ బాబుతో చేస్తున్న ఈ ప్రతిష్టాత్మక అడ్వెంచర్ థ్రిల్లర్ వారణాసి విషయంలో రూటు మార్చారు. ఇప్పటికే దాదాపు 70 శాతం షూటింగ్ చకచకా పూర్తి చేసేశారంటే, పనితీరు ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. 2027 సమ్మర్ కు సినిమాను థియేటర్లలోకి తీసుకువస్తానని గతంలోనే మాట ఇచ్చారు. అనుకున్న సమయానికంటే ముందే షూటింగ్ చివరి దశకు చేరుకోవడంతో ఇప్పుడు తీరిగ్గా బ్రేక్ తీసుకుని రీఛార్జ్ అవ్వాలని నిర్ణయించుకున్నారు. ప్రస్తుతం హైదరాబాద్ లోని శంకరపల్లిలో వారణాసి నేపథ్యంలో సాగే ఒక కీలక షెడ్యూల్ జరుగుతోంది. ఇందులో మహేష్ బాబుతో పాటు పృథ్వీరాజ్, ప్రియాంక చోప్రా కూడా పాల్గొంటున్నారు. ఈ షెడ్యూల్ ముగిసిన వెంటనే చిత్ర బృందం ఒక చిన్న బ్రేక్ తీసుకోబోతోంది. రాజమౌళి తన కుటుంబంతో కలిసి విహార యాత్రకు వెళ్తుండగా, మహేష్ బాబు కూడా విదేశాలకు పయనం కానున్నారు. ఇలా హీరోని కూడా వదిలేశారంటే, ప్లానింగ్ విషయంలో రాజమౌళి ఎంత పక్కాగా ఉన్నారో అర్థం చేసుకోవచ్చు. జక్కన్న పక్కా బౌండెడ్ స్క్రిప్ట్ తో రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది. అంటే ప్రతి సీన్, ప్రతి విజువల్ ముందే పేపర్ మీద లాక్ అయిపోయాయి. అందుకే హాలీవుడ్ రేంజ్ లో సాగే ఈ ఫారెస్ట్ అడ్వెంచర్ షూటింగ్ ఎక్కడా తడబాటు లేకుండా సాగిపోతోంది. గతంలో 'బాహుబలి', 'ఆర్ఆర్ఆర్' సినిమాల సమయంలో విజువల్ ఎఫెక్ట్స్ కోసం నెలల తరబడి సమయం తీసుకున్న ఆయన, ఈసారి షూటింగ్ తో పాటే పోస్ట్ ప్రొడక్షన్ పనులను కూడా సమాంతరంగా నడిపిస్తున్నట్లు సమాచారం. అందుకే రిలీజ్ కు ఇంకా ఏడాది సమయం ఉన్నా ఆయన ఇంత కూల్ గా కనిపిస్తున్నారు. ఈ సినిమాలో యాక్షన్ బ్లాక్స్ గురించి అప్పుడే రకరకాల చర్చలు మొదలయ్యాయి. వారణాసి లాంటి ఆధ్యాత్మిక నగరంలో ఒక భారీ ఫైట్ సీక్వెన్స్ ను డిజైన్ చేసినట్లు తెలుస్తోంది. శంకరపల్లిలో వేసిన ఆ సెట్ విజువల్స్ అచ్చం గంగా ఘాట్లను తలపిస్తున్నాయట. మహేష్ బాబును గతంలో ఎన్నడూ చూడని ఒక కొత్త మేకోవర్ లో చూపించబోతున్నారు. పురాణాలకు సైన్స్ ఫిక్షన్ ను జోడించి అడ్వెంచర్ జోనర్ లో ఈ కథను నడిపిస్తుండటంతో, విదేశీ లొకేషన్లు కూడా ఈ సినిమాలో కీలక పాత్ర పోషించబోతున్నాయి. మరి ఈ సినిమాతో రాజమౌళి ఎలాంటి రికార్డులను బ్రేక్ చేస్తారేమో చూడాలి.

# పార్లమెంట్‌లో ప్రైవేటు బిల్లు ప్రవేశపెట్టాలి

హైద్రాబాద్: బీసీ బిల్లుకై ప్రతిపక్షాలు పార్లమెంట్ లో ప్రైవేటు బిల్లు ప్రవేశపెట్టాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు నీల వెంకటేష్ ముదిరాజ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎంపీ ఆర్ కృష్ణయ్య పాల్గొని మాట్లాడారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి చట్ట సభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు దక్కినప్పుడే మహిళ బిల్లులో బీసీ మహిళలకు రిజర్వేషన్లు లభిస్తాయన్నారు. ప్రతిపక్షాలు బీసీ బిల్లుపై మాట్లాడకుండా బీసీ మహిళ సబ్ కోటాపై రాద్ధాంతం చేస్తున్నారని విమర్శించారు. ఇటీవల బీసీ బిల్లు పెట్టాలని ప్రధాని మోదీని కోరామని, ఆయన సానుకూలంగా స్పందించారని కృష్ణయ్య తెలిపారు. బీజేపీపై బీసీ వ్యతిరేక పార్టీ ముద్ర వేయాలని ప్రతిపక్షాలు కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు. బీజేపీ ఓబీసీ ప్రధాని తోపాటు ఉప రాష్ట్రపతి 27 మంది కేంద్ర మంత్రులను బీసీలకు అవకాశం కల్పించిందని పేర్కొన్నారు. ఇప్పటికైనా బీసీ బిల్లు కోసం అం దరూ కలిసి రావాలని, అప్పుడే బీసీ మహిళలకు న్యా యం దక్కుతుందని స్పష్టం చేశారు. పార్లమెంట్‌లో మహిళ బిల్లు పెట్టడాన్ని స్వాగతిస్తున్నామని ఎంపీ కృష్ణయ్య తెలిపారు. కార్యక్రమంలో బీసీ నేతలు రాజేందర్, నీల వెంకటేష్ ముదిరాజ్, జీ. అనంత య్య, మోదీ రాందేవ్, నిఖిల్ పటేల్, లిం గన్న, పృథ్వి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆస్తి కోసం పిల్లలపై కసాయి తండ్రి కుట్ర

జనగామ: ప్రస్తుత సమాజంలో మానవ సంబంధాలు ఆస్తిపాస్తుల చుట్టూ తిరిగే వ్యాపార లావాదేవీలుగా మారిపోతున్నాయి. ఒకప్పుడు రక్తం పంచుకున్న బంధం అంటే ప్రాణమిచ్చేంత అనుబంధం ఉండేది. కన్నతల్లిదండ్రులను కంటికి రెప్పలా చూసుకునేవారు. కానీ నేడు ఆస్తుల కోసం వారిని వీధుల పాలు చేస్తున్నారు.. కడుపున పుట్టిన బిడ్డలను సైతం కనికరం లేకుండా కడతేరుస్తున్నారు. తాజాగా జనగామ జిల్లాలో దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. ఆస్తి కోసం కన్న పిల్లలనే కాలయముడై చంపేందుకు ఓ తండ్రి కుట్ర పన్నడం తీవ్ర కలకలం రేపింది. రెండో భార్యతో కలిసి ఇద్దరు పసిపిల్లలను విషం పెట్టి హతమార్చాలని చూసిన ఈ ఉదంతం రఘునాథపల్లి మండలం పొట్టిగుబ్బటి తండాలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. తండాకు చెందిన బానోత్ శ్రీనివాస్ అనే వ్యక్తికి 2016లో అనిత మహిళతో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. అయితే కుటుంబంలో మనస్పర్థలు రావడంతో శ్రీనివాస్ ఏడాది క్రితం మమత అనే మరో మహిళను రెండో వివాహం చేసుకున్నాడు. మొదటి భార్య అనిత పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టి రాజీకి వచ్చినప్పటికీ.. ఆస్తి విషయంలో గొడవలు కొనసాగుతూనే ఉన్నాయి. రాజీ ప్రకారం పిల్లల పేరిట అర ఎకరం భూమి, కొంత నగదు ఇవ్వాలని పెద్దలు తీర్పు ఇచ్చారు. పిల్లల పేరిట రాసిన ఆ అర ఎకరం భూమి కూడా తమకే దక్కాలనే దురాశతో శ్రీనివాస్, అతని రెండో భార్య మమత దారుణమైన నిర్ణయం తీసుకున్నారు. పిల్లలను శాశ్వతంగా అడ్డుతొలగించుకోవాలని పథకం వేశారు. ఇందులో భాగంగా ఒక వ్యక్తిని సంప్రదించి విషం కలిపిన బిస్కెట్లను పిల్లలకు తినిపించాలని అందుకు ప్రతిఫలంగా భారీ మొత్తంలో డబ్బు ఇస్తామని ఆశ చూపారు. మొదట నిందితుల ఆఫర్‌కు అంగీకరించిన సదరు వ్యక్తి.. తర్వాత పిల్లలను చంపాలనే ఆలోచనతో భయపడ్డాడు. నేరుగా పిల్లల తల్లి అనిత దగ్గరకు వెళ్లి శ్రీనివాస్ పన్నిన కుట్రను వివరించాడు. తన పిల్లల ప్రాణాలకు ముప్పు ఉందని గ్రహించిన అనిత వెంటనే పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదుపై తక్షణమే స్పందించిన రఘునాథపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రాథమిక విచారణలో పిల్లలను చంపేందుకు ప్లాన్ చేశారని.., కుట్ర నిజమేనని తేలడంతో నిందితులు శ్రీనివాస్, అతని రెండో భార్య మమతను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఆస్తి కోసం కన్న పేగునే తెంచుకోవాలనుకున్న తండ్రిపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి క్రూరమైన చర్యలకు పాల్పడేవారిని కఠినంగా శిక్షించాలని తండా వాసులు డిమాండ్ చేస్తున్నారు.

# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

కట్టంగూరు : ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్, నకరికల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నకిరేకల్ పట్టణంలోని సత్యసాయి ఫంక్షన్ హాల్లో 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రభుత్వం ప్రజలకు అందించిన వివిధ సంక్షేమ పథకాల అమలు తీరును ఎమ్మెల్యే వివరించారు. ప్రస్తుత ప్రభుత్వానికి సంక్షేమం, అభివృద్ధి, విద్యా రంగంపై ప్రత్యేక శ్రద్ధ ఉందని పేర్కొన్నారు. గత పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ సుమారు రూ. 8 లక్షల కోట్ల రూపాయల అప్పు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రజల ప్రాణాలను కాపాడడమే లక్ష్యంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలానికి రూ. 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ను మంజూరు చేయించుకున్నామని, త్వరలోనే మండల కేంద్రంలో ఎమ్మార్వో తహసిల్దార్, ఎంపీడీఓ, ఎంఈఓ కార్యాలయాలకు నూతన భవనాలను నిర్మిస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో జిల్లా పరిషత్ సీఈఓ ప్రేమ్ కరణ్ రెడ్డి, స్థానిక మున్సిపల్ చైర్మన్ చెవుగోని రజిత–శ్రీనివాస్, వివిధ శాఖల మండల అధికారులు, సర్పంచులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# జాగ్రత్తగా ట్రాఫిక్ విధులు నిర్వర్తించాలి



సిరిసిల్ల : అత్యధికంగా ఉన్న ఉష్ణోగ్రతలకు జాగ్రత్తలు వహిస్తూ ట్రాఫిక్ విధులను నిర్వర్తించాలని ఎస్పీ మహేష్ బీగితే అన్నారు. ట్రాఫిక్ పోలీసులు అరోగ్య రక్షణ కు ప్రత్యేక చర్యలు చేపడుతామని అన్నారు. జిల్లా పోలీస్ కార్యాల యంలో జిల్లాలో ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులతో పాటు హోంగార్డులు, సిబ్బందికి అరైవ్– అలైవ్ కార్యక్రమంలో భాగంగా వడగాలులు నుంచి రక్షణకు కల్పించే కూలింగ్ కళ్ల అద్దాలను ఎస్పీ అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ తీవ్ర ఎండల సమయంలో విధులు నిర్వహించే సిబ్బందికి తగి న జాగ్రత్తలు పాటించాలన్నారు. ట్రాఫిక్ సిబ్బంది, బ్లూకోల్ట్స్, పెట్రో కార్ వివిధ బందోబస్తులు నిర్వర్తించే, పాల్గొనే వారు నీటితోపాటు గ్లూకోజ్ తీసుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఎండల ప్రభావం తగ్గించే విధంగా తగిన రక్షణ చర్యలు తప్పనిసరి గా పాటించాలని తగిన జాగ్రత్తలతో విధులను నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన సేవలను అందించాలని ఎస్పీ కోరారు. అరైవ్– అలైవ్ కార్యక్ర మంలో భాగంగా వాహనాదారులకు, ప్రజలకు ట్రాఫిక్ నియమాలపై హెల్మెట్, సీట్ బెల్ట్, వినియోగం, ర్యాష్ డ్రైవింగ్, మద్యం సేవించి వాహ నాలు నడుపడం వల్ల కలిగే అనరాలపై మైనర్ డ్రైవింగ్‌పై విస్తృతంగా అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రాపిక్ అర్ఐ సురేష్, అర్ఎస్ఐలు రాజు, శ్రీనివాస్ సిబ్బంది పాల్గొన్నారు.

# 'ఆదర్శ గ్రామ యోజన'తో అభివృద్ధికి చర్యలు

మంచిర్యాల : ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన ద్వారా గ్రామాల్లో సమగ్ర అభివృద్ధి, వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. కలెక్టర్ సమావేశ మందిరంలో అధికారులతో కలిసి ఎంపిక చేయబడిన ఏడు గ్రామాల సర్పంచులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడు తూ పీఎంఏజీవై పథకంలో ఏడు గ్రామాలు ఎంపికయ్యాయన్నారు. చెన్నూరు మండలంలోని సుందరశాల, దండేపల్లి మండలంలోని ధర్మారావుపేట, హాజీపూర్ మండలంలోని హాజీపూర్, జైపూర్ మండలంలోని కిష్టాపూర్ పరిధిలోని రొమ్మిపూర్, కన్నెపల్లి మండలంలోని సాలిగాం, తాండూర్ మండలంలోని చౌటుపల్లి, వేమనపల్లి మండలంలోని బుయ్యారం గ్రామాలను ఎంపిక చేశామన్నారు. యఈ గ్రామాల్లో అన్నివర్గాల ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, సేవలు అందుబాటులో ఉండి జీవన ప్రమాణాలు మెరుగు పడేలా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. పథకం అమలులో భాగంగా గ్రామస్థాయి సమన్వయ కమిటీలు, జిల్లాస్థాయి ప్రాజెక్టు అప్రైజల్ కమిటీలు, రాష్ట్రస్థాయి కమిటీలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. సర్పంచు అధ్యక్షతన గ్రామస్థాయి కమిటీ, కలెక్టర్ అధ్యక్షతన జిల్లాస్థాయి కమిటీ పనిచేస్తూ పథకం అమలు, పర్యవేక్ష ణ, సమన్వయం వంటి బాధ్యతలను నిర్వహిస్తుందని వివరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రయ్య, డీపీవో వెంకటేశ్వర్‌రావు, జడ్పీ సీఈవో గణపతి, జిల్లా సంక్షేమాధికారి రౌఫ్‌ఖాన్, డీఎంహెచ్‌వో అనిత, అధికారులు, సర్పంచులు పాల్గొన్నారు.

# క్షయ నిర్మూలన ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత

గరిడేపల్లి,: క్షయ వ్యాధి నిర్మూలన ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతని గ్రామ సర్పంచ్ మేకపోతుల వెంకటమ్మ చంద్రయ్య అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు నిక్షయి శిబిర్ (క్షయ వ్యాధి ) కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ వి నరేష్ మాట్లాడుతూ నిక్షయ్ శిబిర్ ప్రచారం అనేది భారతదేశాన్ని క్షయ రహిత దేశంగా మార్చే లక్ష్యం వేగవంతం చేయటానికి నిర్వహించే 100 రోజుల కార్యక్రమం అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా సామూహికంగా క్షయనిర్ధారణ కొరకు స్పూటం పరీక్షలు, ఎక్సరే పరీక్ష సైట్ టీవీ ఇంజక్షన్ వేయడం జరుగుతుందని, ఈ యొక్కసైట్ టీవీ ఇంజక్షన్ ద్వారా వ్యక్తికి బ్యాక్టీరియా ఉన్నదా లేదా నిర్ధారించడం జరుగుతున్నది, శఖఎ పాజిటివ్ ఉంటే టిబి మందులు మా యొక్క ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచితముగా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి నాగేశ్వరరావు, డాక్టర్ సంతోష్, సుష్మ, అశోక్ , సిహెచ్ఓ తీగల నరసింహ, సూపర్వైజర్ అంజయ్య గౌడ్, వెంకటరమణ, స్టాఫ్ నర్స్ యశోద, ఏఎన్ఎం కవిత, అంజలి, పాల్గొన్నారు

# ప్రజా సమస్యలు పరిష్కరించాలి




కొడంగల్, : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక కార్యక్రమం లో ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకే మండల సభ ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. బొంరాస్ పేట్ మండలం రైతు వేదిక నందు ఏర్పాటు చేసిన మండల సభ లో పాల్గొన్నారు.ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా చేపట్టిన మండల సభల ద్వారా ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ అన్నారు. మండల సభకు అధికారులతో కలిసి హాజరై 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక సంబంధిత రాష్ట్ర ముఖ్యమంత్రి సందేశాన్ని అధికారుల ద్వారా చదివి వినిపించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజాపాలన - ప్రగతి నివేదిక కార్యక్రమంలో భాగంగా పారిశుధ్యం, అభివృద్ధి పనుల నిర్వహణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. ప్రజా సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి సమర్థవంతంగా అమలు చేస్తుందని, ఈ పథకాల ప్రగతి వివరాలను ప్రజలకు వివరించి పథకాలపై అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు.మహిళల సంక్షేమం, అభివృద్ధి కొరకు ప్రభుత్వం కృషి చేస్తుందని, ఇందులో భాగంగా రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, మహాలక్ష్మి పథకంలో ఉచిత బస్సు ప్రయాణం, 500 రూపాయలకు రాయితీ గ్యాస్, గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల ఉచిత విద్యుత్, నూతన రేషన్ కార్డులు, సన్న బియ్యం, రాజీవ్ ఆరోగ్యశ్రీ, స్వయం సహాయక సంఘాల మహిళలకు వడ్డీ లేని రుణ సదుపాయం,ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా వివిధ వ్యాపార రంగాలలో ప్రోత్సాహం, అర్హత కలిగిన వారందరికీ వంద శాతం ప్రభుత్వ పథకాల అమలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం లో జడ్ పి సి ఇ ఓ సుధీర్ ,గ్రంథాలయ చైర్మెన్ రాజేశ్వర్ రెడ్డి, బొంరాస్ పేట్ తహసీల్దార్ పద్మావతి, ఎం పి డి ఓ వెంకన్న గౌడ్, సర్పంచ్ విరేశం , ఏం పి ఓ రవి ,జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఏసీబీకి చిక్కిన విద్యుత్ శాఖ ఏడీఈ




దేవరకొండ : విద్యుత్ లైన్ల మరమ్మతులకు సంబంధించిన బిల్లును మంజూరు చేసేందుకు లంచం ఆశించిన నల్లగొండ జిల్లా దేవరకొండ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ (ఏడీఈ) సిరికొండ సైదులు ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. ఏసీబీ అధికారులు తెలిపిన వివరాల మేరకు కంబాలపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో అక్టోబర్ 2025లో వీచిన గాలివానకు దెబ్బతిన్న 33/11 కేవీ విద్యుత్ లైన్లను ఓ వ్యక్తి పునరుద్ధరించాడు.ఇందుకు సంబంధించిన రూ.10 లక్షల బిల్లును ప్రాసెస్ చేసి పై అధికారులకు పంపేందుకు సదరు ఏడీఈ రూ.30 వేలు డిమాండ్ చేశాడు. బాధితుడి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు తన కార్యాలయంలో లంచం డబ్బులు తీసుకుంటుండగా సైదులును రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని అతని వద్ద నుంచి నగదును స్వాధీనం చేసుకున్నారు. విధి నిర్వహణలో అవినీతికి పాల్పడిన నిందితుడిని అరెస్ట్ చేసి జ్యుడీషియల్ రిమాండ్ నిమిత్తం నాంపల్లిలోని ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరచనున్నట్లు వెల్లడించారు.

# ఒక్కో రైతుకు రూ. 2 లక్షలు చెల్లించండి..

హైద్రాబాద్: తెలంగాణలో నకిలీ విత్తనాలతో ఎంతోమంది రైతులు నష్టపోతున్నారు. పంటలు పండక, పెట్టుబడి డబ్బులు నష్టపోయి అప్పులపాలవుతున్నారు. కొందరు రైతులు మాత్రం ఈ నకిలీ విత్తనాల వ్యవహారాన్ని అంత తేలికగా వదిలేయడం లేదు.. నకిలీ విత్తనాలను విక్రయించిన కంపెనీలు నష్టపరిహారం చెల్లించాలని పోరాటం చేస్తున్నారు. వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించి నష్టపరిహారం పొందుతున్నారు. తాజాగా కొందరు రైతులు నకిలీ విత్తనాలతో మోసం చేసిన కంపెనీపై వినియోగదారుల కమిషన్‌లో ఫిర్యాదు చేశారు.. దాదాపు తొమ్మిదేళ్ల పోరాటం తర్వాత పరిహారం చెల్లించాలని ఆదేశాలు వచ్చాయి. 2016లో మహబూబాబాద్ జిల్లా కంబాలపల్లికి చెందిన రైతులు 8మంది రైతులు ఓ సీడ్స్ కంపెనీ నుంచి ధన్య మిరప విత్తనాలు కొనుగోలు చేశారు. తెలంగాణ వాతావరణానికి ఈ విత్తనాలు సరిపోతాయని డీలర్ చెప్పడంతో రైతులు ఒక్కొక్కరు ఒక్కో ప్యాకెట్ రూ.300కి చొప్పున వారికి అవసరమైన మేరు కొనుగోలు చేశారు. ఈ విత్తనాలను పొలంలో చల్లారు.. నవంబర్ నెలకు మొక్కలు బాగా ఏపుగా పెరిగాయి. కానీ ఆ మొక్కలకు పూత లేదు, ఎలాంటి దిగుబడి రాలేదు. 2016 నవంబర్‌లో రైతులు నకిలీ విత్తనాలపై మహబూబాబాద్ ఏఈవోకు ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత జిల్లా అధికారుల బృందం ఆ రైతుల పొలాలను పరిశీలించి ఓ రిపోర్ట్ ఇచ్చారు.అధికారుల రిపోర్ట్ ఆధారంగా 8మంది రైతులు విత్తనాల కంపెనీ హైదరాబాద్‌లో ఉండటంతో వేర్వేరుగా హైదరాబాద్ వినియోగదారుల కమిషన్-1ను ఆశ్రయించారు. విచారణలో రైతులకు విక్రయించిన విత్తనాలు నాణ్యమైనవేనని, తమ దగ్గర ల్యాబ్ రిపోర్టులున్నాయని కంపెనీ ప్రతినిధులు కమిషన్‌లో వాదనలు వినిపించారు. అయితే ఆ రిపోర్టులకు సంబంధించిన తేదీలలో వ్యత్యాసం ఉందని, ప్రభుత్వ ల్యాబ్ సర్టిఫికేషన్ లేదని కమిషన్ తెలిపింది. కంపెనీ ప్రతినిధి ఇన్‌స్పెక్షన్‌కు ఎందుకు వెళ్లలేదని ప్రశ్నించింది. ఈ నకిలీ విత్తనాలకు సంబంధించిన అన్ని అంశాలను పరిశీలించిన కమిషన్ రైతులకు పరిహారం చెల్లించాలని ఆదేశించింది. ఒక్కో రైతుకు రూ.2 లక్షల పరిహారం చెల్లించాలని.. కేసు ఖర్చుల కింద రూ.10 వేల చొప్పున చెల్లించాలని విత్తనాలు విక్రయించిన కంపెనీకి ఆదేశాలు జారీ చేసింది. రైతులకు మొత్తం రూ.16.80 లక్షలు చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు.

# ఉస్మానియా ఆస్పత్రిలో పీజీ వైద్య విద్యార్థి ఆత్మహత్య

హైద్రాబాద్: హైదరాబాద్ ఉస్మానియా ఆస్పత్రిలో పీజీ వైద్య విద్యార్థి ఆత్మహత్య కలకలం రేపింది. పీజీ జనరల్ సర్జరీ ప్రథమ సంవత్సరం విద్యార్థి వసతి గృహంలో నిద్ర మాత్రలు, ఇంజెక్షన్ తీసుకుని చనిపోయాడు. అయితే, సీనియర్ల ర్యాగింగ్ వల్లే తమ బిడ్డ ఆత్మహత్య చేసుకున్నాడంటూ కుటుంబీకులు ఆందోళనకు దిగారు. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లకు చెందిన రాంచందర్- నాగమణి దంపతుల కుమారుడు కాట్రావత్ సురేశ్ (29) ఎంబీబీఎస్ పూర్తి చేసి ఇటీవల పీజీ కోర్సు ఉస్మానియా ఆస్పత్రిలో చేరాడు. తాను కోరుకున్న జనరల్ మెడిసిన్ సీటు రాకపోవడంతో, చివరకు కుటుంబ సభ్యుల ఒత్తిడి నేపథ్యంలో జనరల్ సర్జరీలో చేరినట్టు సమాచారం. మూడు నెలలుగా ఉస్మానియా ఆస్పత్రిలోని పీజీ విద్యార్థుల వసతి గృహంలో ఉంటూ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం తల్లితో ఫోన్లో మాట్లాడేవాడని సహచర విద్యారులు తెలిపారు. గురువారం ఉదయం 7:30 గంటల సమయంలో తల్లికి ఫోన్ చేసి మాట్లాడాడు. ఆ తర్వాత గదిలో అపస్మారక స్థితిలో పడి ఉండటంతో గమనించిన పీజీ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని అమూల్య.. అతని కుటుంబీకులకు సమాచారం అందించారు. సహచర విద్యార్థులు అతన్ని చికిత్స నిమిత్తం ఉస్మానియా క్యాజువాల్టీకి తరలించారు. అప్పటికే అతను మృతిచెందినట్టు వైద్యులు ధృవీకరించారు. సాయంత్రం వరకూ మృతదేహాన్ని క్యాజువాల్టీలోనే పెట్టారు. మృతుడి కుటుంబీకులు వచ్చి కన్నీరు మున్నీరయ్యారు. చదువుల్లో టాపర్‌గా ఉండే సురేశ్ సున్నిత మనస్తత్వం కాదని, ఆత్మహత్యకు బలమైన కారణం ఏమైనా ఉంటుందని వారు అనుమానం వ్యక్తం చేశారు. సీనియర్ విద్యార్థుల వేధింపులే ఆత్మహత్యకు కారణమని ఆరోపించారు. క్యాజవాల్టీ నుంచి మృతదేహాన్ని మార్చురీకి తరలించకుండా కుటుంబీకులు అడ్డుకున్నారు. తమకు న్యాయం జరిగే వరకూ పోస్టుమార్టం చేసేది లేదంటూ నినాదాలు చేయడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. పోలీసులు భారీగా మోహరించారు. చివరకు సాయంత్రం మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతుడి స్నేహితులు, బంధువుల నుంచి కొన్ని వివరాలు సేకరించామని.. పని ఒత్తిడి, ఇష్టం లేని కోర్సులో చేరాననే అత్మన్యూతనకు లోనై ఆత్మహత్య చేసుకొని ఉండొచ్చని అఫ్జల్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ మోహన్‌రావు తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## భూ భారతితో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

ఖమ్మం, : ప్రజలకు పారదర్శకంగా సులభతరమైన సేవలు అందించడానికి, భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కూసుమంచి మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ రెవెన్యూ అధికారులతో మాట్లాడారు. ఇంటిగ్రేటెడ్ భూ భారతి పైలట్ పోర్టల్ ప్రాజెక్ట్ అమలు పై రెవెన్యూ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. రైతులు ఇంటి వద్ద నుంచి కూడా స్లాట్ బుకింగ్ చేసుకునేలా పోర్టల్ తయారు చేశామని, రైతులు లాగిన్ కాగానే భూమి వివరాలు కనిపిస్తాయని, ఎన్ని ఎకరాలకు సర్వే కావాలో కోరితే అందుకు సంబంధించిన ఫీజు చెల్లించిన తర్వాత ఏడు రోజుల లోపు సర్వే పూర్తి చేస్తారని తెలిపారు. రైతు సర్వే మ్యాప్ నకు యూనిక్, భూధార్ నెంబర్లు కేటాయిస్తారని భూభారతి పోర్టల్ లో కూడా వివరాలు నిక్షిప్తమవుతాయని అన్నారు. పైలెట్ ప్రాజెక్టు క్రింద ముందుగా కూసుమంచి మండలంలో ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్ అమలు చేస్తున్నట్లు తెలిపారు. భూ సంబంధిత సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని, భూ భారతి కింద ఉన్న దరఖాస్తులన్నింటిని త్వరితగతిన పరిష్కారించేందుకు అధికారులు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో పాలేరు నియోజకవర్గ స్పెషల్ అధికారి రమేష్, కూసుమంచి మండల తహసీల్దారు సైదులు, కలెక్టరేట్ భూ భారతి సూపరింటెండెంట్ నాగేశ్వరరావు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# బాలసదనం బాలికలు బాగా చదువుకోవాలి



వరంగల్, బాలికల భవిష్యత్తు బలంగా ఉండాలంటే విద్యే ప్రధాన ఆధారం అని, బాల సదనంలో ఉన్న ప్రతి విద్యార్థిని మంచి లక్ష్యాలతో కృషి చేస్తూ బాగా చదువుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్పాయి సూచించారు. హనుమకొండ సుబేదారిలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలికల బాల సదనాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు.బాల సదనంలో ఉన్న విద్యార్థినుల సంఖ్య, వారు అభ్యసిస్తున్న కోర్సులు, వంటశాల నిర్వహణ, ఆహార నాణ్యతపై విద్యార్థినులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం వంటగదిని పరిశీలించి, భోజన నాణ్యతను పరీక్షించారు. వేసవి సెలవుల్లో బాలికల హాజరు, దత్తత ప్రక్రియలపై జిల్లా సంక్షేమ అధికారి విశ్వజ, సూపరింటెండెంట్ కళ్యాణి నుంచి వివరాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాల సదనంలోని బాలికల పట్ల అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, వారికి ఉత్తమ సంరక్షణ, విద్యా అవకాశాలు కల్పించాలని ఆదేశించారు.దత్తతకు సంబంధించిన దరఖాస్తులు వచ్చిన పక్షంలో, బాలికల గార్డియన్ సమ్మతితో పారదర్శకంగా, వేగవంతంగా చర్యలు చేపట్టాలని సూచించారు. బాలికలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగి, ఉన్నత స్థాయికి చేరుకునేలా కృషి చేయాలని ప్రోత్సహించారు. ఇద్దరు విద్యార్థినులు జనరల్ నర్సింగ్ కోర్సులో ప్రవేశం పొందేందుకు సిద్ధంగా ఉన్నట్లు జిల్లా సంక్షేమ అధికారి వివరించగా, కలెక్టర్ వారికి అభినందించారు.సందర్శన సమయంలో లక్ష్మీ ప్రసన్న అనే బాలికకు పుట్టినరోజు కావడంతో, జిల్లా కలెక్టర్ ఆమెకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. స్వయంగా దగ్గరకు తీసుకుని ఆశీర్వదించడం ద్వారా బాలికలో ఆనందం నింపారు. అలాగే బాల సదనానికి సంబంధించిన రికార్డులను పరిశీలించి అవసరమైన సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఎం. కళ్యాణి, జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఇన్చార్జి ఎస్. ప్రవీణ్ కుమార్, ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎం. మౌనిక, కౌన్సిలర్లు త్రివేణి, గౌతమి తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా ప్రభుత్వ కార్యక్రమాలు

ఎర్రవల్లి,: సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా ప్రభుత్వం వివిధ పథకాలను ప్రవేశపెట్టిందని, ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాలతో ప్రజలకు పెద్ద ఎత్తున అవగాహన కల్పించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. 99 రోజుల కార్యక్రమాల్లో భాగంగా ఎర్రవల్లి మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక మండల స్థాయి సమావేశంలో జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు.ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని 10 ముఖ్యాంశాలను అ జెండాగా తీసుకొని 99 రోజులపాటు వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. హెచ్ పివి వ్యాక్సిన్ తో సర్వైకల్ క్యాన్సర్ ను నివారించవచ్చని 14 ఏళ్ల అమ్మాయిల అందరికీ వ్యాక్సిన్ వేయడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం ఇందిరమ్మ ఇండ్లు రాని వారికి తర్వాత విడతలో మంజూరు చేయడం జరుగుతుందన్నారు.వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అల్పాహారం ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. సర్పంచులు తమ పరిధిలోని పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలను క్రమం తప్పకుండా సందర్శిస్తుంటే అక్కడి పని తీరు మెరుగుపడుతుందన్నారు. రేషన్ కార్డులు లేని అర్హులైన వారందరూ దరఖాస్తు చేసుకోవాలని, తొందరగానే ఇవ్వడం జరుగుతుందని నిరంతర ప్రక్రియగా పేర్కొన్నారు.అనంతరం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పలువురు గర్భిణీలకు సామూహిక సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్య, వైద్య, సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వివిధ స్టాల్స్ ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. అంతకుముందు ఎర్రవల్లి మండల వివిధ శాఖల అధికారులు పలు ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు. లబ్ధిదారుల వివరాలను వెల్లడించారు.అలాగే వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజలు తమ ప్రాంత సమస్యలను గురించి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా పరిష్కారానికి కృషి చేస్తామని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో ఎర్రవల్లి మండల ప్రత్యేక అధికారి సుషిత, తహసిల్దార్ నరేష్, ఎంపీడీవో మహేష్, సర్పంచ్ అనిత, ఇతర ప్రజాప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు, తదితరులున్నారు.

# అక్షరాస్యత, ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం




షాద్ నగర్, : రంగారెడ్డి జిల్లా ఫరూక్ నగర్ మండల కేంద్రంలో నిర్వహించిన '99 రోజుల ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' సమావేశంలో రాష్ట్ర పంచాయతీ రాజ్ కమిషనర్ దివ్య దేవరాజ్, జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి మరియు స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకరయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం వారికి బస్సులు, సోలార్ ప్లాంట్లు, పెట్రోల్ బంకుల నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తోందిని, రాష్ట్రవ్యాప్తంగా 8,000 మహిళా సంఘ భవనాల నిర్మాణం వేగంగా జరుగుతోందని గుర్తుచేశారు.అంతకుముందు సంక్షేమ పథకాల పై అధికారులు సమీక్ష చేశారు. రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ వంటి పథకాల అమలు తీరును అధికారులు వివరించారు. ముఖ్యమంత్రి అల్పాహారం, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వంటి నూతన పథకాలపై అవగాహన కల్పించారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో గ్రామాలను అభివృద్ధి చేయడంలో సర్పంచులు కీలక పాత్ర పోషించాలని కమిషనర్ సూచించారు. పెరిగిన ట్రాఫిక్ దృష్ట్యా ప్రతి ఒక్కరూ హెల్మెట్, సీటు బెల్టు ధరించాలని కలెక్టర్ నారాయణ రెడ్డి సూచించారు. ఇందిరమ్మ ఇళ్లను వర్షాకాలం లోపే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కొరకు ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికి చేరాలని ఆ దిశగా అందరూ పని చేయాలని అన్నారు. ఇందిరమ్మ ఇళ్లు చాలా వరకు ఇప్పటికే పూర్తి కాగా మిగిలినవి చివరి దశలో ఉన్నాయని తెలిపారు. అతి త్వరలో మిగతా వాటిని కూడా పూర్తి చేస్తామని వెల్లడించారు.గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి సంబంధించి ఎలాంటి సమస్యలు సర్పంచ్లు తన దృష్టికి తెచ్చిన వెంటనే స్పందిస్తున్నానని ఆయన వెల్లడించారు. అనంతరం కళ్యాణ లక్ష్మి చెక్కులు, అంగన్వాడీ విద్యార్థులకు యూనిఫాంలు, దివ్యాంగులకు ట్రై సైకిళ్లను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈవో కృష్ణారెడ్డి, మున్సిపల్ చైర్మన్, డిపిఓ సురేష్ మోహన్, పిడి డి.ఆర్.డి. ఏ శ్రీలత, డిసిపి శిరీష, ఆర్డీవో సరిత ఎంపీడీవో బన్సీలాల్, ఏసిపి లక్ష్మీనారాయణ, తాసిల్దార్ నాగయ్య, సర్పంచులు, అధికారులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# డాక్యుమెంటేషన్ వర్తమాన సమాజానికి మార్గదర్శి



వరంగల్:సుబేదారిలోని కాకతీయ విశ్వవిద్యాలయం ఆరట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రజా సంబంధాల (పి ఆర్ ఓ) కార్యాలయం ఆధ్వర్యంలో 2025 సంవత్సరానికి సంబంధించిన పత్రికా, మీడియా క్లిప్పింగ్స్ వార్షిక నివేదికను విడుదల చేశారు. ఈ నివేదికను కాకతీయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కర్నాటి ప్రతాపరెడ్డి, కేయూ రిజిస్ట్రార్ ఆచార్య రామచంద్రం, ఓఎస్డి ఆచార్య వెంకట్రాంరెడ్డి, ఆరట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి బుధవారం లాంఛనంగా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఉపకులపతి ఆచార్య కర్నాటి ప్రతాపరెడ్డి మాట్లాడుతూ మాన్యువల్ డాక్యుమెంటేషన్ ప్రస్తుత సమాజంలో అత్యంత ప్రాముఖ్యత కలిగిన అంశమని పేర్కొన్నారు. సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఈ కాలంలో కూడా పత్రాల రూపంలో సమాచారాన్ని భద్రపరచడం అవసరం తగ్గలేదని స్పష్టం చేశారు. భవిష్యత్ తరాలకు సరైన ఆధారాలు అందించడంలో డాక్యుమెంటేషన్ కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు.రిజిస్ట్రార్ ఆచార్య రామచంద్రం మాట్లాడుతూ ఆరట్స్ కళాశాల పౌర సంబంధాల విభాగం చేపట్టిన ఈ కార్యక్రమం విశేష ప్రాశస్త్యాన్ని సంతరించుకుందని తెలిపారు. వివిధ సందర్భాల్లో పత్రికలు, మీడియా ద్వారా వెలువడిన వార్తలను ఒకే చోట సమగ్రంగా సమీకరించడం విద్యాసంస్థకు గౌరవాన్ని తీసుకువస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆరట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి, కేయూ మాజీ ఈసీ సభ్యులు ఆచార్య బత్తిని చంద్రమౌళి, కళాశాల వైస్ ప్రిన్సిపల్ రెహ్మాన్, ఆరట్స్ కళాశాల పౌర సంబంధాల అధికారి డాక్టర్ ఆదిరెడ్డి, అధ్యాపకులు డాక్టర్ ఆశీర్వాదం, డాక్టర్ శ్రీధర్ కుమార్, డాక్టర్ సుచరిత, డాక్టర్ జితేందర్, హరికుమార్, కేయూ పీఆర్ఓ డాక్టర్ పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by SAYED PASHA Printed at MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State,
Published From: MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State.
Editor: SAYED PASHA, RNI No. RNI NO. TEITEL 2010/34557, Cell: 9849758280